# నీళ్లు

పి. రామకృష్ణారెడ్డి



'వర్షం బాగా కురిసింది. యేరువాక సేద్యాలు మొదలైతాయిగావాలి' అనుకున్నాడు లింగయ్య. ఎదురుగ్గా పారు తున్న మురుక్కాలువకేసివుమ్మేసి, బీడీ తాగుతూ కళ్ళు చికిలించి ఆకాశం కేసి చూసినాడు. బూడిద రంగులో వున్న మేఘాలు వుల్లాసంగా వున్నట్లున్నాయి. ఇంకా సన్న తుంపర రాల్తోంది. రోడ్డుమీద చితచితగావుంది. అయినా, జనం నడుస్తో న్నారు. ప్యాంటులూ, పంచెలూ, అప్పు డప్పుడూ రంగురంగుల చీరెలు కొంచెంగా పైకెత్తుకున్న పాదాలు చెప్పుల్తో, బూట్లతో నడుస్తూ పోతున్నాయి. సన్న తుంపర రాల్తోందటంతో లింగయ్య కప్పుకున్న బట్ట తడిసింది. కొట్టం కొప్పునించీ వాసాల మీదుగా జారినట్లు, తలమీదినించీ వెంట్రుకల పాయలమీదుగా చుక్కలుగా జారుతోంది సన్నవాన. చలిగాలి ఝల్లున కొడుతోంది. గోనెపట్ట పైన కట్టుకుందామంటే, నిన్న మునెయ్య తీసుకొని పోయినాడు. మునె య్యకు రాత్రి పడుకునేందుకు వేరే స్థల ముంది. గంగయ్యకూ, రాముడికూ కూడా వుంది. వాళ్ళకున్నవి "స్థలాలే" కానీ యిళ్లు కావు. మునెయ్య, గంగయ్యల పెళ్లాం పిల్లలూ, హోటళ్ళలో అక్కడక్కడా సెంటర్లలో అడుక్కుంటారు. పెండ్లాం పిల్లల్ని అడుక్కోమనడానికి సిగ్గులేదంట్రా! అని తిడతాడు రాము వాళ్ళను. "నీకేంరా వొంటిగాడివి, వొంటో శక్తున్నవాడివి: రోజంతా యీడ కూకొని సచ్చినా రూపా యొచ్చే తలికి కట్టం, అన్ని కడుపుల కెట్టా మల్ల?" అంటారు మునెయ్య, గంగయ్య. "ఇయాలింకా యెవరూ రాలేవేంది?" అను కున్నాడు లింగయ్య. "వరుసంలో యేమంత సావనుకున్నారేమో!" అని తనే మళ్ళా జవాబు చెప్పుకున్నాడు. వాళ్ళ పెండ్లాం పిల్లలు అడుక్కొని తెచ్చిన కూట్లోనే వాళ్ళూ పిడికెడు తింటారు. ఇట్టాటప్పుడు గిరాకీ వుంటాదని రాముడు రిక్షా 'యేస్తాడు' తనకు "రిక్షా" యేసే జంతేదు. అడుక్కోనూ

లేదు. ఎదురుగా హోటల్లోకి పోయేవాళ్ళు, వచ్చేవాళ్ళు, లోపల అద్దాలగుండా కనిపిస్తూ యేవేవో తింటూ కూచున్నవాళ్ళు!

లింగయ్య బీడీముక్క మురుక్కాలువలోకి విసిరేసినాడు. "పరగడుపున బీడీ తాగితే బాధ పుట్టాదని" అప్పుడు జ్ఞాపకం వచ్చింది లింగయ్యకు. అయితే, బీడీకూడ తాగకుండా యెట్లా వుంటాడు? అదీ...... తనదగ్గరున్నప్పుడు! లింగయ్య మళ్ళీ రోడ్డుమీద కదిలే పాదాల్ని చూస్తున్నాడు. ఎర్రగా బొద్దుగా రక్తంతో బికిసలాడే, లేత తాటిముంజెలట్లా పాదాలు కదుల్తోన్నాయి. అట్లాంటి పాదాలు చూడటం బాగానూ వుంటుంది బాగా లేకుండానూ వుంటుంది. పరగడుపున బీడీ తాగినట్టుగానే వుంటుంది. రాళ్ళూ, మట్టీ కొట్టుకుని గాయాలై, మచ్చలై చిత్తడి నేలల్లో తిరిగి చివికి, కరుకునేలల్లో నడిచి చితికి, తాను భైరవుని కోనలో చూసిన భైరవుని పాదాలవంటి పాదాలు. వాటికి కొత్తచెప్పులు తొడిగిన అనుభవం ముసలివాళ్ళను పులకరింపచేస్తుంది. "పాత గ్యాపకాల్తో" కొత్త పల్లె గిర్రున తిరుగుతుంది. తన వుండూరైన కొత్త పల్లె జ్ఞాపకాలు కొన్ని "ఆరె" మాదిరి మనస్సును కోసేవి, మరికొన్ని సూది మాదిరి కలిపి కుట్టేవి!!కోసేవి కొయ్యడానికే పనికొస్తాయి, కుట్టేవికుట్టడానికే పనికొస్తాయి. వుపయోగించకుండా వుంటే రెండూవొకటే! వుపయోగిస్తే దేనిపని అది చేస్తుంది.

లింగయ్య తండ్రి, తాతలు అవూళ్ళోనే కాలం వెళ్ళదీసినారు. లింగయ్య కూడా పుట్టడం, పెరగడం, పెళ్ళిచేసుకోవడం, ముఖ్యంగా యిన్నేళ్ళూ బతకడం, మొదలైన పనులు చేస్తూ కొత్తపల్లె పొలిమేర దాటకుండా యాభై యేళ్ళు దాటినాడు. కొత్తపల్లెలో తనవాళ్ళవి యిరవై యిండ్లదాకా వుండేవి. ఇప్పుడు—రెండుమూడిండ్లు మాత్రం వూరును కనిపెట్టుకుని చావకుండా, బతక్కుండా వున్నాయి. అంతమంది జనం యెట్లా పోయినారో తల్చుకుంటే "యినితం" గావుంటుంది. మళ్ళీ కొత్తపల్లె వూరు పెరిగింది! "మాదీ మిద్దెలు, పెరిగాయి" 'నాగరీకం' పెరిగింది. తనవాళ్ళుమాత్రమే నాశనమైనారు. ముసిలోళ్ళు రోగాల్తోనూ వయసోళ్ళు తాగుడ్తోనూ పోయినారు.

కొత్తపల్లెలో లింగయ్యకు సెంటు భూమి లేదు. అయినా, "యేరువాక సేద్యాలు మొదలైతాయిగావాల" అనుకుంటున్నాడు. భూమేకాదు వున్న కొట్టమూ, దాని యెనకాల నాలుగుబార్ల బిసుగు జాగా, బాకీలోకని తీసుకుని తన కళ్ళెందొడ్లోకలుపుకున్నాడు నరిసిరెడ్డి. కొడుకు దగ్గురోగంతో, కోడలు పిల్ల కలరాతో పోయిరి. బండీబతకా పనికిపోయే బిసలేదు గనుక యెవరూ గింజా గిట్టా యెయ్యక పోయిరి. ఉండూరుతో వూపిరి నిలుపుకునేదెట్టా? ఇప్పటి జనానికి తను కుట్టే చెప్పులుకూడా "మొరటు" అయిపోయె!

అప్పుడు వూరు విడిచినాడు లింగయ్య. ఊరు విడిచినాడంటే యెట్లా! ఆరె, సూది, చిన్నరంపె, గూటమూ తోలుసంచిలో వేసుకున్నాడు...... మెల్లగా వూరు దాటినాడు. పొలిమేర దాటేదాకా తమవూరు విడిచిపెట్టి వస్తున్నట్టు తనకే నమ్మకంలేదు. యెన్నో తరాల్నించీ, నాయిన్నాయిన్ల కాలంనించీ వున్న వుండూరు యిడిసిపెట్టేసినట్టేనా?

ఇన్నేండ్ల సంబంధమున్న వూరు విడిచి పెట్టడానికి అయిదునిమిషాలన్నా పట్టలేదే! ఒక్కరన్నా, "ఉండూరిడిచి యాడికి బోతావ న్లేదు!" ఉండూరిడిసి యేమనిసీ యెక్కడికీ బోలేదు, అనే తన పెద్దవాళ్ళ మాట జ్ఞాపకమొచ్చింది, బోడమేగాదు...... బోడానికి నిటమన్నా పట్టలేదు'" మొట్టమొదట వూరి మీద కోపంగా వుండేది లింగయ్యకు. తరువాత "వూరేం జేత్తాది"లే అనుకున్నాడు. నిన్న కొత్తపల్లె మనిషి కనబడితే మనుషుల్ని కూడా పేరు పేరునా అడిగినాడు. మళ్ళా 'కొత్తపల్లెకాడ వర్షంపడనందుకు విచారపడినాడు!

కాకి, రెక్క విదిలించుకున్నట్టు తల విదిలించుకున్నాడు లింగయ్య. తల తుడుచుకోడానికి పొడి గుడ్డలేదు. పడమటి వానయినందున గోడ అవివ్వలేక పోతోంది. ఈ గోడ కింద కూచోడా క్కూడా మోటల్లో, మునెయ్య, గంగయ్య లొప్పుకోలేదు. రాముడు వాళ్ళిద్దర్నీ తిట్టినాడు.

'అడుక్కునేనాయాల్లకు' ఆయేబుద్దులు, కట్టంజేసి బతికే వాళ్ళకాడ అట్టాటివుండవు' రానాన్న... రా! యేంజేత్తారో సూత్తాను అన్నాడు.

అప్పుడే కాదు, రాముడు 'శానాసాయం' చేసినాడు. ఉంగటమో, వారో తెగిన వాళ్ళు చెప్పు యీడ్చుకుంటూవస్తారు. దాన్నిందుకుని బాగుచేస్తాడు. 'రెండు రూపాయలకు చిల్లరుందా? ఐదు రూపాయలుందా?' అనడుగుతారు కొందరు 'లేదులే — సామీ!' అని వినయంగా అంటాడు తనే తప్పుచేస్తున్నట్టు! రాముడు చూసినాడు. 'ఇన్నేండ్లొచ్చినాయి, యెందుకు యెరి నాకొడుక్క!' అని తిట్టినాడు. 'ఏమబ్బీ', అనడిగితే చెప్పినాడు. లింగయ్య నమ్మలేదు. 'పది యిరవై పైసాలకు ఆ మారాజులు అబద్దం చెప్తారా!' అనుకున్నాడు.

ఒకాయన, చిల్లరుందా?' అన్నప్పుడు 'నాదగ్గరుండితే, యెంతగావాల!' అన్నాడు రాముడు. ఆయన కొంచెం ఆశ్చర్యపోయి, ముఖం చిట్లించుకుని, మళ్ళా జేబు తడుముకుని అప్పుడే చూసుకున్నట్టు 'ఆ... వుందిలే.' అని రెండుపది పైసలబిళ్ళలు పారేసి పోయినాడు.

అది జ్ఞాపకమొస్తూనే తనదగ్గర పది పైసలున్నట్టు జ్ఞాపమొకచ్చింది లింగయ్యకు. జేబు తడిమిచూకున్నాడు. టీ తాగాలన్నా యింకో అయిదు పైసలుండాల. ఎదురుగా హోటళ్ళో స్థలం చాలక కొంతమంది నిలబడి వున్నారు. కొత్తలో ... కొత్తపల్లె తప్ప యింకేం తెలీని లింగయ్యకు ఆ హోటల్ని చూస్తోంటే విచితంగా వుండేవి. ఆ హోటల్లోకి గుంపులు గుంపులుగా పోయేవాళ్ళంతా "పలాత్తం" వాళ్ళేమోననుకున్నాడు. చూడగా ...రోజూ పొయ్యేవాళ్ళు, రోజుకు రెండు మూడుసార్లు యెవరెవర్తోనో కలిసిపోయేవాళ్ళు వున్నట్లుతెలుసుకున్నాడు. ఆలోచించి... ఆలోచించి రామున్ని అడిగినాడు.

"అబ్బీ' ఆ హోటల్లోకి పోయేవాళ్ళంతా యీవూరోళ్ళేనా? పలాత్తలంవాళ్ళా ?" అని. రామునికి వెంటనే అర్థంకాలేదు. ఆ తర్వాత, లింగయ్య యెందుకట్లా అడుగుతున్నాడో తెలుసుకుని గట్టిగా... పడి పడీ నవ్వినాడు.

"ఓర్రెర్రి ముసిలోడా! ఆకలేసి పొయ్యేవాళ్ళతోనే అయితే, ఆ హోటల్ వాడు లక్షలెట్లా సంపాదిస్తాడు? అంతలాడ్జీ యెట్లాకడతాడు? ఆ పొయ్యేవాళ్ళలో అవుసరముండి పోయేవాళ్ళు పది మందయితే, అవుసరం లేకనే పోయేవాళ్ళు తొంభై మంది రానాయినా!"

"అట్టనా?" అనుకున్నాడు ఆశ్చర్యంగా. లింగయ్య. కాలువనూ, కాలువ కవతల హోటల్నూ చూస్తున్నాడు. ఆకాశంలో బూడిద రంగు మేఘాలు, చిక్కగా నలుపు దేరుతున్నాయి. రెండు రోజులుగా ఆగకుండా వర్షం పడుతూనేవుంది.

కావాలని కోరుకునే కొత్తపల్లె కాడ పన్నేలేదు.

మురుక్కాలువలోకి కొత్త నీళ్ళు గలగలాదూకుతున్నాయి. కాలువ వురవడిగా పారుతోంది. ఈ తడి గాలి మీద హోటల్ వాసన్లు యింకా ఘాటుగావస్తున్నాయి. కాలువ నీళ్ళలో హోటల్ నీడ కనిపిస్తోంది.